## మినీకథ

# ఎందువలన అంటే అందువలన



### మీకు మోహన్‌రావు తెల్సా?.... ....

కొంచెం కష్టం. పొద్దున లేస్తే ఫలానా అమ్మాయి. ఫలానా అబ్బాయి ప్రేమించు కొంటున్నారు. ఓ అమ్మాయిని పలకరించ బోయిన వాడికి చెప్పు ఝుళిపింపులే మిగి లాయి- అంటూ ప్రతి కాలేజీలోనూ కబుర్లు వినిపించే ఈ రోజుల్లో- మోహన్ రావులు కథల్లోనూ, నవలల్లోనూ, ఊహ ల్లోనూ తప్ప విడిగా కనిపించడం- కొంచెం కష్టం.

వీడు - నా బెస్ట్ ఫ్రెండ్

అమ్మాయి అంత దూరంలో ఎదురుగా వస్తోందంటే.... ప్రక్కసందులోకి తప్పు కొనే రకం.

పక్కన సందు లేకపోతే- క్రాసింగ్ జరిగే దాకా వంచిన తలెత్తడన్నమాటే!

బాగా నూనెరాసి నున్నగా దువ్విన తల, గొంతువరకు పెట్టిన షర్టు గుండీలు, బి. సి. మోడల్ వాచీ, తోలుచెప్పులు, లూజుపాంటు బెదురు బెదురుగా ఉండే చూపులు— మను షుల్తో మాట్లాడానికే భయపడుతున్నట్లుండే వాడు

అట్లాంటి బెదురుగొడ్డు జీవితంలోకి— గాలి దుమారంలా ప్రవేశించింది సీత.

వాడు ధ్రువమైతే.... ఈమె ఈ ధ్రువం. చెప్పిన కబురు చెప్పకుండా గంటలకొద్దీ మాట్లాడేస్తుంది- చలోక్తులతో.

తన్ను చూసి ఈలేసిన వాడిపై— చెప్పు ఝుళిపించడం, తలొంచుకుపోయిన వాడ్ని చూసి ఫకాల్న నవ్వడం ఆమె హాబీలు.

"విజాతి ధ్రువాలు ఆకర్షించుకుంటాయి" సైన్సు మాష్టర్లు బద్ధాల్జెప్పరు.

ఎలా ఇద్దరూ కల్సిపోయారో తెలియదు గాని— విడదీయరానంత గాఢంగా కల్సి పోయారు.

పెళ్ళి తప్పదు గదా!

అప్పటికీ చెప్పి చూశా! "ఒరే వెధవా నువ్వేమో ఒట్టి వాజమ్మవి. నోట్లో నాలుక లేనివాడివి. నిన్ను ఆడించేస్తుంది. కాస్త నెమ్మదిగా వుండే అమ్మాయిని చేసుకుంటే మంచిదేమోరా?" అని.

వింటేనా!...,

సరే! ....

శుభం!

* * *

మీకు మోహన్‌రావుగారు తెల్సా? .... మరి సీతమ్మగారో!....

అయ్యయ్యో! తెలియకపోవడమేంటండీ. భారత దేశమంతా వీళ్ళేగదా!

ఓ సారి వెళ్ళాను.... ఎలా ఉన్నారో చూద్దామని. రాత్రి ఎనిమిది గంటలయిందను కుంటా....

గేటుతీసి లోపలికి అడుగుపెట్టానోలేదో ఏవో పెద్దగా అరుపులు. కేకలు విన్పించ డంతో గబగబా పంచలోకి అడుగుపెట్టాను.

పంచలో కూచుని గబగబా పాఠాలువల్లె వేస్తున్న పదకొండేళ్ళ బాబు. ఆరేళ్ళపాప ఈ కేకలకు కొంచెం ఆపి.... మళ్ళా గబ గబా చదివేస్తున్నారు - ఇది రోజూ జరిగే భాగోతమే అన్నట్లు.

నేనున్న చోట్నుంచి లోపలి దృశ్యం కనబడుతోంది.

ఆమె జుట్టు ఆయన చేతిలో ఉంది.

చెంపలు పటపటా వాయించేస్తున్నాడు.

"దొంగలం.... ఎంత ఉద్యోగం చేస్తే మాత్రం నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెడ తావా. ఎవర్నడిగి ఖర్చుపెట్టావ్. ఎవడితో తిరిగావే ఇప్పటిదాకా. నీ బోడి మొహానికి కొత్త చీరలు తక్కువయ్యాయా?"

వీరావేశంతో ఒక్క తోపు తోసేసరికి ఆమె వెల్లికిలా పడిపోయింది.

లోపలికి వెళ్ళి.... నేను చేసేదేముంది. వెనుదిరిగి వచ్చేశాను.

ఆలోచనల గజిబిజి....

ఊహలకు— జరిగే సంఘటనలకు ఎప్పుడూ పొత్తు కుదరదేమో.

ఆ మోహన్‌రావే.... ఇప్పుడిలా మారా డంటే, ఆ సీతే....ఇప్పుడిలా వుందంటే....

నమ్మబుద్ధి కావడంలేదు. ఎందువల్ల ఇలా జరిగింది?

ఎందువల్ల....?

ఎందువల్ల....?

మెరుపులా సమాధానం తళుక్కున మెరి సింది.

అతడు -'భర్త' - మగాడు.

ఆమె - 'భార్య' - ఆడది.

తరతరాలుగా భర్త అధికారం చెలా యించేవాడు. సర్వాధికారం- అనే భావం "వీడిలో"-'భార్య' అణిగిమణిగి ఉండాల- భర్తను వదిలేస్తే దిక్కులేనిదై పోతాను అనే భావం "ఆమె"లో జీర్ణించి ఉన్నంతకాలం...

హుఁ.... !

ప్చ్.... !

**హన్మంత్రావ్**